ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

మలివిడత సమీకరణకు కసరత్తు

14 గ్రామాల్లో 44 వేల ఎకరాల గుర్తింపు - మూడు గ్రామాల్లో ముగిసిన గ్రామ సభలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని నిర్మాణంలో భాగంగా మలి విడత భూ సమీకరణకు ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. తుళ్లూరు, అమరావతి, తాడికొండ, మంగళగిరి, పెదకాకాని మండలాల్లోని దాదాపు 14 గ్రామాల్లో ఈ సారి భూ సమీకరణ జరగనుంది. 2015లో తుళ్లూరు మండలంలో జరిగిన తొలి విడత భూ సమీకరణలో పెండింగ్‌లో ఉన్న వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాలను కూడా ఈసారి సమీకరణలో భూములు తీసుకోనున్నారు. అమరావతి మండలంలోని వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి గ్రామాలను ఎంపిక చేశారు. ఇటీవల కర్లపూడి తప్ప మిగతా మూడుగ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

భూ సమీకరణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. కొంత మంది వ్యతిరేకించినా పలువురు సానుకూలత తెలిపారు. తాడికొండ, కంతేరు, నిడుముక్కల, పొన్నెకల్లు, రావెల గ్రామాల్లో కూడా సమీకరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైల్వే లైను నిమిత్తం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా భూమిని తీసుకోనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. మంగళగిరి మండలం కాజతో పాటు మరికొన్ని గ్రామాల్లో కూడా సమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు.



రాజధాని కోసం సమీకరించిన భూములు (ఫైల్)

పెదకాకాని మండలంలో నంబూరును కూడా ఎంపిక చేశారు. ఎర్రుబాలెం నుంచి నంబూరు వరకు నేరుగా రైల్వే లైను ఏర్పాటు అవుతుండటం, నంబూరును ప్రధాన జంక్షన్‌నుగా మార్చాలనే ప్రతిపాదనలతో భూముల సమీకరణను కసరత్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయం కూడా తాడికొండ, మేడికొండూరు మండలాల మధ్య ఏర్పాటు అవుతుందనే ప్రచారంతో ఈ ప్రాంతంలో భూములకు గిరాకి పెరిగింది. ఒక సినీనటుడు తన వ్యాపార సంస్థల పేరుతో తాడికొండ, మేడికొండూరు మండలాల్లో ఇటీవల 200 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మొత్తంగా 44 వేల ఎకరాల భూ సమీకరణతో ఆయా గామాల్లో కలకలం రేపుతోంది. ఏయే భూములు ఎంపిక చేసారో తెలుసుకునేందుకు రైతులు రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు.

రాజధానిలో భూ సమీకరణ వల్ల రైతులకు ధరలు పెరిగినా ఇంత వరకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించకపోవడం వల్ల రైతులకు కొంత అయోమయం నెలకొంది. 2015 జనవరిలో ప్రారంభమైనా భూ సమీకరణలో 37,941 ఎకరాలకు గాను 34,689 ఎకరాలను సిఆర్‌డిఏకు రైతులు అప్పగించారు. ఇంకా 3,252 ఎకరాలు ఇవ్వడానికి దాదాపు వెయ్యి మంది రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. భూ సమీకరణలో తీసుకున్న 34,689 ఎకరాలతో పాటు ప్రభుత్వ భూములు మరో 17 వేల ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

పోరాటాలతోనే ఆ చట్టాలను తిప్పికొట్టాలి

- 15 ఏళ్లుగా పెరగని కార్మికుల వేతనాలు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేరుతో శ్రమ దోపిడీ
- 20న సమ్మెలో అన్ని రంగాల కార్మికుల ఐక్యంగా పాల్గొనాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - మాచర్ల

కేంద్రంలో అధికారంలో వున్న ప్రభుత్వం తమకు బలముంది కదా.. అని కార్మికుల హక్కులపై ఉక్కుపాదం మోపుతూ కార్పొరేట్లకు అనుకూలమైన చట్టాలను చేసుకొంటోందని, పోరాటాల ద్వారా వాటిని కార్మికవర్గం తిప్పికొట్టాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. మాచర్లకు శనివారం వచ్చిన ఆయన స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఈనెల 20న చేపట్టే స్వాత్రిక సమ్మె జయప్రదం కోసం వివిధ యూనియన్లతో వై.సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టించే కష్ట జీవులకు వేతనాలు పెంచేందుకు ముందుకు రాని ప్రభుత్వాలు.. పారిశ్రామిక వేత్తలకు, వేల ఎకరాల ధారాదత్తం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 15 ఏళ్లుగా కార్మిక వర్గ వేతనాలు పెరగలేదని, ఖర్చులు మాత్రం అనేక రెట్లు పెరిగాయని చెప్పారు. పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గుతోందని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య పెరుగుతోందని, అయితే వీరికి ఎటువంటి ▶ 2లో



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

శంకర్‌విలాస్ ఆర్‌ఒబికి 7న శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ఈనెల 7న శంకుస్థాపన చేస్తున్నట్లు నగర కమిషనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. విస్తరణ పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబి రోడ్ విస్తరణ పనులను ఏసీ కాలేజి నుండి అరండల్‌పేట పోలీస్ స్టేషన్ వరకు కమిషనర్ శనివారం పరిశీలించారు. తొలుత ఆర్‌ఓబి నిర్మాణ డిజైన్‌ని పరిశీలించి, ఇప్పటి వరకు జరిగిన విస్తరణ పనులు, మార్కింగ్ తదితర అంశాలను పట్టణ ప్రణాళిక, ఆర్‌అండ్‌బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 7న శంకుస్థాపనకలో కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆర్‌ఓబి ప్రభావిత భవనాల్లో అంగీకారం తెలిపిన వారి భవనాలను తొలగించడం, ఆక్రమణలను లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాలిక అధికారులను ఆదేశించారు. అంగీకారం తెలిపిన వారి భవనాలకు నష్ట పరిహారం అందించడానికి ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. పర్యటనలో ఎస్ఇ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్‌కుమార్, ఆర్‌అండ్‌బి డిఇఇ చిన్నయ్య, ఎఇఇ సంజీవ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- గుంటూరు జిల్లాలో 16, పల్నాడు జిల్లాలో రెండు కేంద్రాల్లో పరీక్షలు
- గుంటూరు జిల్లాలో హాజరు కానున్న 4250 మంది



గుంటూరులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఆర్ఒ, డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య విద్య ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించే నీట్-2025 పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలో 16 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. గుంటూరులో 14, తెనాలిలో రెండు పరీక్షా కేంద్రాలున్నాయి. 4250 మంది పరీక్షకు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఆఫ్‌లైన్ విధానంలో ఈ పరీక్ష జరుగుతుంది. కాగా విద్యార్థులను ఉదయం 11 గంటల నుండే అనుమతిస్తారు. 1.30 గంటల తర్వాత అనుమతించరు. పరీక్షకు హాజరయ్యే వారు అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజు ఫొటో, ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలి. నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల వస్త్రధారణపై ఆంక్షలు గతంలో మాదిరిగానే కొనసాగుతాయి. బంగారు, ఇతర ఆభరణాలు, చేతికి వాచీలు వంటివి ధరించకూడదు. ప్రతి పరీక్షా కేంద్రానికి జాతీయ పరీక్షా సంస్థ ఎన్‌టిఎ తరపున ఒక పరిశీలకుడు, అదనంగా కలెక్టర్ ఆదేశాలతో ఎంఆర్ఒ స్థాయి అధికారిని నియమించారు. శనివారం నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, పరిశీలకులతో సన్నాహక ▶ 2లో

అవేమీ చెప్పకుండా ఇళ్ల పత్రాలడిగితే?

రోడ్ల నిర్మాణ బాధితుల సమావేశంలో రాజధాని ప్రాంతవాసుల అసంతృప్తి

ప్రజాశక్తి - తుళ్లూరు



రాజధాని ప్రాంతం తుళ్లూరులో రోడ్ల నిర్మాణం కారణంగా స్థలాలు, ఇళ్లు కోల్పోయే వారితో సిఆర్‌డిఎ అధికారులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ-3, ఎన్-13 రోడ్ల నిర్మాణం కారణంగా తుళ్లూరులో కొన్ని ఇళ్లు తొలగించాల్సి ఉన్న నేపథ్యంలో ప్రభావితమయ్యే వారితో సమావేశమై స్థలాలు, ఇళ్లకు సబంధించిన పత్రాలివ్వాలని చెప్పారు. దీంతో సమావేశానికి వచ్చినవారు కొంత అసహనానికి గురయ్యారు. పరిహారంతో పాటు ఎంతమేరకు ఇళ్లు తొలగిస్తారు? ఇళ్ల తొలగింపు ప్రక్రియ ఎప్పుడు మొదలు పెడతారు? తదితర వివరాలు చెప్పకుండా పత్రాలడగడం ఏమిటని ప్రశ్నించారు. వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, తహశీల్దార్ రవిబాబు చెప్పడంతో ఉన్నతాధికారులతోనే మరోసారి సమావేశం నిర్వహించాలని చెబుతూ సమావేశానికి వచ్చినవారు వెళ్లిపోయారు.



హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి

పోలీసు శాఖలో 35 ఏళ్లు సమర్ధవంతంగా విధులు నిర్వహించి, ఉన్నతాధికారుల మన్ననలు పొందిన హెడ్ కానిస్టేబుల్ బండ్ల నాగేశ్వరరావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. కృష్ణానదిలో దూకి ఆత్మహత్యలు చేసుకోవడానికి వచ్చిన వారిని అడ్డుకొని, వారికి నచ్చచెప్పి, కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులుకు అప్పగించి ఎంతో మంది ప్రాణాలు కాపాడి ఆయన ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా శనివారం గుంటూరు ఎస్పీ కార్యాలయంలో నాగేశ్వరరావు, పద్మావతి దంపతులను అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, స్పెషల్ బ్రాంచి సిఐ ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది సత్కరించారు. తాడేపల్లి సిఐ కళ్యాణ్‌రాజు, ఎస్సైలు ప్రతాప్, జె.శ్రీనివాసరావు, ఖాజావలి శుభాకాంక్షలు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీ వైబ్ సంస్థ అధినేత రాఘు వీణ

మంగళగిరిలో 11న 3కే రన్

హాజరుకానున్న మంత్రి లోకేష్ దంపతులు

ప్రజాశక్తి- మంగళగిరి

మాతృ దినోత్సవం సందర్భంగా ఈనెల 11వ తేదీన మంగళగిరిలో సాయంత్రం 6 గంటలకు త్రీకె రన్ కార్యక్రమం ఎన్నారై సమీపంలోని గౌతమ్ బుద్ధ రోడ్డుపై జరుగుతుందని వి వైబ్ సంస్థ అధినేత రాఘు వీణ శనివారం తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను పట్టణంలోని ఆటో నగర్‌లో గల వీవర్స్ శాల ఆవరణలో ఆవిష్కరించారు. నడక, పరుగు, సంగీతం, కార్యక్రమాలతో అమ్మ, భారతీయ సంస్కృతిని రక్షించే నేతన్నను గౌరవించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ రన్ లో మహిళలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి హాజరవుతారని చెప్పారు.

మలివిడత సమీకరణకు కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాలు కూడా రాజధానికి వినియోగించుకునేందుకు సిఆర్‌డిఎ తన అధీనంలోకి తీసుకుంది. మొత్తంగా 51 వేల ఎకరాలు రాజధానికి సిద్ధం చేయగా ఇంకా 44 వేల ఎకరాలు కూడా సమీకరణకు తీసుకోవడం వల్ల రైతుల్లో ఆందోళన లేకపోలేదు.

రాజధాని వెలుపల లావాదేవీలు పుంజుకున్నాయి. రాజధాని గ్రామాల్లో లావాదేవీలు పూర్తిగా మందగించాయి. దీంతో తమ భూములకు ధరలు తగ్గుతాయోమోనన్న బెంగ రైతుల్లో నెలకొంది. అయితే రాజధానిలో భూముల విలువ ఏమాత్రమూ తగ్గదని, గజం రూ.లక్షకు అమ్మిస్తామని, కొంతకాలం వేచి ఉండాలని ప్రభుత్వ పెద్దలు రైతులను సమాధాన పరుస్తున్నారు. అంతేగాక పారిశ్రామిక అవసరాల కోసం రాజధానిలో కంటే బయట ప్రాంతంల్లో ధరలు తక్కువగా ఉండటం వల్ల ఈ భూములు తీసుకోకతప్పడం లేదని రాజధాని రైతులను జెఎసి నాయకులు ఒప్పిస్తున్నారు. రాజధానిలో రైతుల నుంచి భూములు తీసుకున్న సిఆర్‌డిఎ మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగిస్తామని రైతులకు హామీ ఇచ్చింది. కానీ వేర్వేరు కారణాలతో పదేళ్లయ్యింది. ఈ పరిస్థితుల్లో తాము కూడా సమీకరణలో భూములు ఇస్తే తిరిగి రిటర్నబుల్ ప్లాట్లు కోసం ఎంత కాలం వేచి ఉండాల్సి వస్తుందో అనే భయం కూడా కొత్తగా భూములివ్వాల్సిన రైతుల్లో నెలకొంది.



సమావేశంలో కార్మికులు, నాయకులు

పోరాటాలతోనే ఆ చట్టాలను తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

చట్టపరమైన హక్కులూ లేకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ప్రభుత్వాలను దుయ్యబట్టారు. పెట్టుబడిదారి వర్గాల లాభాలు శాతం పెంచేందుకు కార్మిక వర్గ హక్కులను నిర్వీర్యం చేస్తున్నారని, ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కూడా లేబర్ కోడ్‌ల పేరుతో హరిస్తూ కార్మికుల వెన్ను విరుస్తున్నారని మండిపడ్డారు. సంఘం పెట్టుకొనే హక్కులేదు.. సమ్మె చేసే హక్కు లేదు.. వారు చెప్పినన్ని గంటలు పనిచేయాలి.. వారు మానుకోమన్నప్పుడు మానుకోవాలి.. అనే పరిస్థితికి కార్మికులను తీసుకుపోతున్నారని విమర్శించారు. తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఇప్పటికే పలుమార్లు సార్వత్రిక సమ్మెలు చేశారని, మే 20వ తేదీన సమ్మె ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికుల పోరాటశక్తిని మరోసారి తెలియజెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. సమ్మె నేపథ్యాన్ని వివరించారు. ఢిల్లీలో జరిగిన రైతు పోరాటం మోడీని తలవంచేలా చేసిందని, కార్మికులు కూడా ఐక్యంగా కదిలితే ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు, ప్రైవేటీకరణ విధానాల రద్దు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పనిదినాలు అమలు చేయాలని తదితర సమస్యలపై అనేక కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్దఎత్తున కలిసి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, మల్లేశ్వరి, నాయకులు బి.మహేష్, వెంకటరత్నం, వి.వెంకట్రావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాహుల్ వత్తిడితోనే కులగణన : కాంగ్రెస్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జనగణనతో పాటు కులగణన చేయాలన్న కాంగ్రెస్ పార్టీ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గిందని మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి అన్నారు. కేంద్రం నిర్ణయానికి కాంగ్రెస్ కృషి కారణమని పేర్కొంటూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం పాలాభిషేకం చేశారు. కేంద్రం కులగణనకు అంగీకారం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చారు. జనగణతో పాటుగా కులగణన చేసేది లేదని భీష్మించిన బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులు ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకోవడానికి ఎట్టకేలకు కులగణనకు అంగీకారం తెలిపారని అన్నారు. పార్లమెంటు లోపల, బయట రాహుల్ గాంధీ ఈ నిర్ణయానికి కట్టుబడి పలు పోరాటాలు చేశారని గుర్తు చేశారు. భారత్ జోడోయాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రతో దేశంలోని 95 శాతం ప్రజలకు సమానత్వ సామాజిక ఆర్థిక రాజకీయ ఫలాలు అందాలనే రాహుల్ గాంధీ ఆకాంక్షలు కులగణనతో అయినా పూర్తవుతాయని భావిస్తున్నట్టు మస్తాన్‌వలి వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధి చిత్రపటానికి పాలాభిషేకంతోపాటు స్థానిక హిందూ కళాశాల వద్ద ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రత్తయ్య, కలీల్, కరీం, జానీ ఇస్మాయిల్, మోషే పాల్గొన్నారు.

పబ్బరాజు వెంకటేశ్వరరావు చిరస్మరణీయులు



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు

పబ్బరాజు వెంకటేశ్వరరావు గుంటూరులో 1996లో శ్రీషిరిడిసాయి దీనజన సేవా సమితి స్థాపించి వందలాది పేద, అంధ విద్యార్థులకు భోజన, వసతి తోపాటు విద్యను అందించిన మహనీయులని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. శనివారం పబ్బరాజు వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి గుంటూరులోని శ్రీ షిరిడి సాయి దీనజన సేవాసమితి అంధుల, వికలాంగుల, అనాధల శిక్షణాలయంలో రిటైర్డ్ హెచ్‌ఎం వెలగపూడి పాండురంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వరరావు గత 29 ఏళ్లుగా అంధులైన వందలాది విద్యార్థులకు ఉచితంగా భోజన వసతితో పాటు విద్యను అందించి చిరస్మరణీయులయ్యారని అన్నారు. బ్రెయిలీ లిపితోపాటు ఆడియో క్యాసెట్స్ ద్వారా 10వ తరగతి, ఉచితంగా విద్యను కంప్యూటర్ శిక్షణ, పోటీ పరీక్షలకు తర్ఫీదు ఇవ్వడం లాంటి కార్యక్రమాలకు అంధ విద్యార్థులకు సేవలు అందించిన మహనీయులు వెంకటేశ్వరరావు అని కొనియాడారు. పోటీ పరీక్షల శిక్షణ ద్వారా 43 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని గుర్తు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ ఆఫీసర్ తనుబుద్ధి కోటిరెడ్డి మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, నిబద్ధతతో కృషి చేస్తే అంధత్వం అభివృద్ధికి అడ్డుకాద న్నారు. హెచ్‌ఎం నల్లపు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్రెయిలీ లిపితోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యతోపాటు అన్ని రంగాలలో అంధులు సైతం అత్యున్నత స్థాయికి ఎదిగిన వారు ఎందరో ఉన్నారన్నారు. కార్యక్రమంలో శ్రీషిరిడి సాయి దీనజన సేవాసమితి కార్యదర్శి పి.ఎస్. మూర్తి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుభట్లజయ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేత ఎన్.తిరుపతయ్య తదితరులు ప్రసంగించారు. తొలుత పబ్బరాజు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

న్యాయవాదుల బీమాను పెంచడంలో బార్ కౌన్సిల్ తాత్సారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక కొత్తపేటలోని అతిధి సమావేశపు మందిరంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐల)సమావేశం శనివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్ మాట్లాడుతూ లాయర్ల న్యాయమైన కోర్కెల సాధనకు ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ తోడుగా ఉంటుందని అన్నారు. లాయర్లపై జరుగుతున్న దాడులను ఐల ఖండిస్తుందని చెప్పారు. మార్చి 23న జరిగిన బార్ కౌన్సిల్ సమావేశంలో న్యాయవాదులకు ప్రస్తుతమిస్తున్న రూ 4 లక్షల జీవిత బీమాను రూ.10 లక్షలకు పెంచేలా చర్చించామని, ఈ విషయంలో బార్ కౌన్సిల్ తాత్సారం చేస్తోందని చెప్పారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ ఐలకు తమ సహకారం ఉంటుందన్నారు. సమావేశానికి సీనియర్ న్యాయవాది పిల్లి విద్యాసాగర్ అధ్యక్షత వహించగా సీనియర్ న్యాయవాదులు హుస్సేన్, ఇందుపల్లి రాజారామ్, ఎ.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక అధ్యక్షత వహించగా కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, గుంటూరు నగర ఉప కో-ఆర్డినేటర్లు ఎంఇఒ అబ్దుల్ ఖుద్దూస్, ఎస్.ఆనంద్ పాల్గొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలవుతుందని డిఇఒ తెలిపారు. అనంతరం డిఆర్ఒ ఖాజావలి, డిఇఒ స్థానిక చౌత్రా సెంటర్‌లోని ఉర్దూ బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలించారు.

నీట్ బందోబస్తుపై పల్నాడు ఎస్పీ సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పరీక్షలకు బందోబస్తుపై పోలీసులతో పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శనివారం సమీక్షించారు. నరసరావుపేట మండలం కాకాని గ్రామంలోని జెఎన్‌టియు, నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామంలోని పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు వచ్చే విద్యార్థులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసి వారు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా సహకరించాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసేయించాలని, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు.

ప్రముఖ కీబోర్డ్ ప్లేయర్ పెద్దిరాజు మృతి

ప్రజాశక్తి - తెనాలిరూరల్



తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ కీబోర్డ్ విద్వాంసులు, ఇస్కఫ్ కార్యవర్గ సభ్యులు అభ్యుదయకళా సమితి సంగీత దర్శకుడు పెద్దిరాజు(51) శనివారం గుండెపోటుతో మరణించారు. పెద్దిరాజు తండ్రి టి.రామారావు మ్యూజికల్ బ్యాండ్ పార్టీ క్లారినెట్ విద్వాంసులు. తన తండ్రి మృతి అనంతరం బ్యాండ్ ట్రూపు నడుపుతూ, రాష్ట్రంలో 50 మంది సంగీత కళాకారులతో వందలాది ప్రదర్శనలిచ్చారు. హైదరాబాద్, ఖమ్మం, విశాఖపట్నం ప్రాంతాల్లో ఇప్టా నిర్వహించిన రాష్ట్ర సభల్లో 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' నృత్యనాటిక, గోదాదేవి కళ్యాణం, పోస్టర్ నాటికలకు సంగీతాన్ని అందించి రక్తకన్నీరు నాగభూషణం, మాదల రంగారావుల ప్రశంసలు అందుకున్నారు. పెద్దిరాజు మృతిపట్ల సినీ సంగీత దర్శకులు కోటి, వసూరావు ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. రచయిత బొల్లిముంత కృష్ణ మాస్టారు, సైదారావు సదాశివ, సుభాని, డాక్టర్ రావిపాటి వీరనారాయణ, బెల్లంకొండ వెంకట్, తెనాలి, గుంటూరు పరిసరప్రాంత సంగీత కళాకారులు, పలు బ్యాండ్ పార్టీలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - నకరికల్లు


వీర్ల కళ్యాణి (ఫైల్)

రోడ్డు దాటు తున్న మహిళను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శని వారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజుపాలెం మండలం అను పాలెం గ్రామానికి చెందిన వీర్ల కళ్యాణి (65) చల్లగుండ్ల గోరంట్ల మేజర్ వద్ద బంధువుల చిన్న దినం కార్య క్రమం కోసం బస్సు దిగి రోడ్డు దాటు తుండగా పిడుగురాళ్ల నుంచి అతివేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లారీ పక్కనే ఆగి ఉన్న మరో లారీని కూడా ఢీ కొట్టింది. మృతురాలి భర్త వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కాని స్టేబుల్ నారాయణ తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాల కు తరలించారు.


ముగింపు రోజు చిన్నారులతో పాస్టర్ పత్రా

ముగిసి విబిఎస్ విరామ బైబిల్ పాఠశాల తరగతులు

ప్రజాశక్తి - వినుకొండ : ఘనంగా జరిగిన విబిఎస్ తరగతులు విను కొండ కళ్యాణపురి కాలనీ నందు క్రీస్తు బ్లెస్సింగ్ చర్చి సిబిసి ద్వారా మే ఒకటి రెండు మూడు తేదీలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బాల బాలికలకు విరామ బైబిల్ పాఠశాల విబిఎస్ తరగతులు ఎంతో ఘనంగా నిర్వహించ బడ్డాయి ఈ కార్యక్రమంలో సంఘ కాపరి పాస్టర్ పత్రా పి లిడియా ఫిలిప్ చిల్డ్రన్స్ మిషనరీ అయిన కమల ఆగస్టీన్ వారి బందం పాల్గొని మూడు రోజులపాటు పిల్లలకు మంచి బైబిల్ కథలు పాటలు పప్పెట్ షోలు మ్యాజిక్ షో స్కిట్స్ గేమ్స్ నేర్పిం చారు ఈ వేసవి కాలంలో చిన్నపిల్లలకు ఈ కార్యక్రమం నిర్వహించుట ద్వారా వారు చిన్న వయసు నుండి దైవభక్తి యొక్క అడుగుజాడలలో నడిచి మన వినుకొండకు మన రాష్ట్రానికి దేశానికి భావిభారత పౌరులుగా ఎదుగుతారని పాస్టర్ ఫిలిప్ తెలిపారు ఈనాటి ఈ కార్యక్రమంలో 300 పిల్లలు హాజరుకాగా వారందరూ పట్టణ పురవీధుల నందు ర్యాలీ నిర్వహించారు వీరందరికీ మూడు రోజులపాటు డాక్టర్ కె వెస్లీ బహుమతులు అందించారు సిబిసి టీచర్స్ హెల్పర్స్ వాలంటీర్స్ అందరూ పాల్గొని ప్రతి రోజు పిల్లలకు శీతల పానీయాలు బిస్కెట్స్ అల్పాహారం అందించారు తెలిపారు.

దుర్గగుడి ఘాట్ రోడ్ మూసివేత

ప్రజాశక్తి - విజయవాడ : ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మరమ్మతు పనుల, కొండ చరియలకు మెష్ తదితర పనుల నిమిత్తం మే 6,7,8 తేదీల్లో ఘాట్ రోడ్ పూర్తిగా మూసివేసేందుకు నిర్ణయించినట్లు ఆలయ అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. శ్రీ కనకదుర్గానగర్ మార్గం నుండి యాత్రికులు దేవస్థానానికి చేరుకోవాలి. హైదరాబాద్ నుండి వచ్చే యాత్రికులు పున్నమి ఘాట్లో తమ వాహనాలు పార్క్ చేసుకుని అక్కడ నుండి దేవస్థానం ఏర్పాటు చేస్తున్న ఉచిత బస్ ద్వారా దేవస్థానానికి చేరుకోవచ్చుని, విశాఖపట్నం, చెన్నయ్ తదితర ప్రాంతాల నుండి వన్‌టౌన్ వైపు వచ్చే యాత్రికులు సీతమ్మ వారి పాదాలు వద్ద ఉన్న హోల్డింగ్ ఏరియాలో తమ వాహనాలు పార్క్ చేసుకొని దేవస్థానం ఏర్పాటు చేసే ఉచిత బస్ ద్వారా దేవస్థానానికి చేరుకోవాలని ఆలయ ఇఒ కె.రామచంద్ర మోహన్ తెలిపారు.

అడవిలో చిక్కుకున్న మత్స్యకారుణ్ణి కాపాడిన పోలీసులు



మత్స్యకారుడు శ్రీనుతో సిఐ నఫీస్ బాష, సిబ్బంది

ప్రజాశక్తి - విజయపురిసౌత్

దారితెలియక అటవీ ప్రాంతంలో చిక్కుకున్న మత్స్య కారుడు శ్రీను ను సురక్ష ప్రాంతానికి పోలీసులు తీసుకొచ్చారని మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీష్ బాష తెలిపారు. శనివారం స్థానిక రూరల్ సిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లి గూడెం గ్రామానికి చెందిన కొడమంచిలి శ్రీను అతని భార్య కొడమంచిలి ధనలక్ష్మి ఇద్దరు చేపలు పట్టే పని కోసం పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం జెండా పెంట గ్రామం దగ్గర మర్రి చెట్టు ముండే ప్రాంతం దగ్గరకు ఏప్రిల్ 19 వ తేదీన వచ్చారు. వేటకు కృష్ణ నదిలో వెళ్లి ఈనెల 2వ తేదీన ఉదయం 07.00 గంటలకు దారి తప్పి, రాత్రంతా నీరు, ఆహారం లేకుండా కొత్త పుల్లారెడ్డి గూడెం అడవుల్లో ఉండి, దారి తెలియకపోవడంతో మరుసటి రోజు ఉదయం 09.00 గంటలకు డయల్100 ఫోన్ చేయగా వెల్దుర్తి ఎస్ఐ ఎస్.కెసమందర్ వలి వెంటనే స్పందించి, వారి ఫోను లొకేషన్ తెలుసుకొని, పోలీసుసిబ్బంది సహాయంతో వారి యొక్క జాడని కనుక్కొని, వారిని అక్కడి నుండి సురక్షిత ప్రాంతానికి తీసుకొని వచ్చినట్లు తెలిపారు. వెంటనే స్పందించి తమ ప్రాణాలు కాపాడి సురక్షిత ప్రాంతానికి తీసుకువచ్చిన పల్నాడు జిల్లా పోలీసు అధికారులకు బాధితులు శ్రీను కృతజ్ఞతలు తెలిపాడు.

వీధి కుక్కల సమస్య ఉంటే ఫోన్ చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - గుంటూరు



గుంటూరు నగరంలో వీధికుక్కల సంతాన నియంత్రణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఏటుకూరు రోడ్డులోని జిఎంసి ఎబిసి సెంటర్‌ను కమిషనర్ శనివారం తనిఖీ చేశారు. రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా ఎబిసి చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గతనెల 23న పున:ప్రారంభించిన ఎబిసి సెంటర్‌లో ప్రస్తుతం ప్రతిరోజూ 25 కుక్కలకు ఎబిసి, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ జరుగుతుందని, ఈ సంఖ్యని పెంచాలని చెప్పారు. సెంటర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కుక్కలకు తగిన ఆహారం సమయానికి అందించడంలో సిబ్బంది భాధ్యతగా ఉండాలన్నారు. ఎబిసి సెంటర్‌ని వారంలో 2 లేదా 3 ఆకస్మిక తనిఖీలు చేస్తామని, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగర ప్రజలు కూడా వీధి కుక్కల వలన ఏమైన సమస్యలు ఎదురైతే జిఎంసి కాల్‌సెంటర్ 08632345103కి ఫోన్ చేయాలని సూచించారు.

రవికుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి



సత్తెనపల్లి కి చెందిన బెజగం రవికుమార్ పౌరాణిక కళా రంగంలో అర్ధ శత పురస్కారాలు పొంది ఉన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయం త్రం స్థానిక (వడ్డవల్లి) శ్రీ రాధాకృష్ణ మందిరంలో పట్టణ కళాకారుల సమక్షంలో ప్రముఖ వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవి కుమార్‌కు దుశ్శాలవాలతో ఘన సన్మానం చేశారు. పౌరాణిక కళారంగలో విభిన్న పౌరాణిక పాత్రలు ధరించి రెండు రాష్ట్రాల స్థాయిలో ప్రదర్శనలు చేసి రెండు రాష్ట్రాల ప్రేక్షకులను రంజింప చేసినందుకు రెండు రాష్ట్రాల స్థాయిలు వివిధ కళా సంస్థల, కళావేదికల నుండి మొత్తం 50 పురస్కారాలు గ్రహించిన సందర్భంగా పట్టణంలోని కళాకారులందరు బెజగం రవి కుమార్‌కి అభినందనలు తెలిపారు. 10వ తరగతి పరీక్ష లో 575 మార్కులు పొందిన కోటి సాహితీ అనే బాలికను ఈ సందర్భంగా దుస్సాలు వతో సన్మానించి పెన్స్ బహుకరించారు. ఈ కార్యక్రమం లో కాటుమల నాగేశ్వరరావు, దావీదు, మిత్రులు కళా కారులు అంజలి కోటేశ్వరరావు, ఎలిశెట్టి ప్రసాద్, మాతంగి సాంబశివ రావు కోటేశ్వరరావు, గిరీష్ రెడ్డి సత్యనారాయణ రాజు, ప్రేమ్ కుమార్, మాదల స్కూల్ ఉపాధ్యాయులు జి.కృష్ణ పాల్గొని అభినందనలు తెలిపారు.

గన్నవరం విమానాశ్రయానికి పుచ్చలపల్లి సుందరయ్య పేరు పెట్టాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కృష్ణా జిల్లా గన్నవరంలోని విమానాశ్రయానికి అదే నియోజకవర్గానికి చెందిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో పుచ్చలపల్లి సుందయ్య విమానాశ్రయంగా నామకరణం చేయాలని ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది వల్లభనేని నాగ పవన్ కుమార్ (నాని) డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కృష్ణా జిల్లా గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావుకు లేఖ రాశారు. లేఖను పోస్టు ద్వారా పంపిన ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్వాతంత్ర్య సమరయోధులుగా దేశం కోసం పోరాడిన యోధులుగా, తన ఆస్తిని పేద ప్రజలకు పంచి ఇచ్చిన త్యాగశీలి అన్నారు. సైకిల్ పైన శాసన సభకు వెళ్లిన నిరాడంబరుడుగా నేటి రాజకీయ నాయకులకు విలువలతో కూడిన రాజకీయాన్ని పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి ఉమ్మడి కృష్ణా జిల్లా వాసి అయినందుకు అందరం గర్వపడాలన్నారు. ఆయన పేరును గన్నవరం విమానాశ్రయానికి నామకరణం చేయడం ద్వారా ఆయనకు ఘన నివాళి అర్పించిన వారమవుతమని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావుతో పాటు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడికి, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడికి, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు, రాష్ట్ర ఐటి, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు, రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రకు ఈ లేఖను రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపినట్లు ఆయన పేర్కొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డా. కె. శ్రీనివాస్

ఎక్సైజ్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

నాటుసారాయి నిర్మూలన కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమంలో భాగంగా గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డా.కె.శ్రీనివాస్, డిపిఈవో మణికంఠ మాచర్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాటు సారా నిర్మూలణకై ఇప్పటి వరకు తీసుకొన్ని చర్యలపై మాచర్ల ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వెంకట రమణను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎడాప్షన్ ఆఫీ సర్స్‌తో సమావేశమయ్యారు. నవోదయ 2.0భాగంగా వీలైనంత త్వరగా సారారహిత గ్రామాలుగా చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయి మండల స్థాయి కమిటీల ద్వారా గ్రామాల 'ఏ' కేట గిరి లోని గ్రామాలు అన్నిటిని కూడా సారారహిత గ్రామాలుగా ప్రకటించుకోవాలని, అలానే దుర్గి మాచర్ల వెల్దుర్తి మండలాలను ఈనెల చివరికల్లా సారారహిత మండలాలుగా ప్రకటించుకోనేం దుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

15 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - పెదకూరపాడు

రేషన్ బియ్యం 15 బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు పెదకూరపాడు ఎస్సై గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శని వారం మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన రసూల్ నుండి బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - పెదకూరపాడు


చట్ట వ్యతిరేక పనులు చేసే వ్యక్తులపై తగు చర్యలు తీసుకుంటామని పెదకూర పాడు ఎస్ఐ గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శని వారం ఆయన మాట్లాడు తూ అసాంఘిక కార్య కలా పాలు నిర్వహించేవారు, ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాలలో అనుమానాస్పదంగా వ్యక్తులు తిరుగుతూ ఉంటే వెంటనే పోలీస్ స్టేషనుకు సమాచారం ఇవ్వాలన్నారు. సమా చారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వేసవి సెలవుల్లో ఊళ్ళకి వెళ్ళేవారు ఇంటికి తాళాలు వేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పేకాట, జూదం, ఇతర ఆటలు ఆడుతూ ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. సమస్యలు సృష్టించే వారిని వదిలిపెట్టే అవకాశం లేదన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.

చెస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కానూరులోని స్కాట్ స్పైన్ స్కూల్‌లో శనివారం రాష్ట్ర స్థాయి అండర్ -9 బాల బాలికల చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. తొలుత పోటీలను స్కూల్ సిఇఒ జాహ్నవి ప్రారంభించారు.

బాలురు : తొలిరోజు నాలుగు రౌండ్లుగా పోటీలు జరిగాయన్నారు. నాలుగు రౌండ్లు ముగిసే నాటికి వి.హితేష్ (నెల్లూరు), పి.జస్వంత్ (ప్రకాశం), ఎ.శశాంక్ (వెస్ట్ గోదావరి), ఎ.ప్రభంజన్ నాయుడు మొదటి నాలుగు స్థానాలో నిలిచారు.

బాలికలు : వి.మోధితా రెడ్డి (తిరుపతి), డి.మోక్ష సత్య ఆద్య (ఈస్ట్ గోదావరి), జి.సహస్ర (నెల్లూరు) వరుసగా మూడు స్థానాలలో నిలిచారు.



గంజి వీరాస్వామిని సన్మానిస్తున్న తెలుగు-వెలుగు సాహితీ సంస్థ

గంజి వీరాస్వామికి అరుదైన గౌరవం

భారత కీర్తి కిరీటి పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు గంజి వీరాస్వామి అరుదైన "భారత కీర్తి కిరీటి పురస్కారం"ప్రదానం జరిగింది. రెండున్నర దశాబ్దాలుగా సామాజిక సేవలో అంకిత భావంతో పని చేస్తున్న గంజి వీరస్వామి సేవలను గుర్తించిన తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థ (ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి,కర్ణాటక, మహా రాష్ట్ర, ఒరిస్సా,రాష్ట్రాలకు చెందిన) వారు మే 1వ తేదీన విశాఖ పట్నం పౌర గ్రంథాలయంలో జరిగిన సాంస్కృతో త్సవాలలో గంజి వీరస్వామికి తెలుగు వెలుగు ఉగాది జాతీయ పురస్కా రాల్లో అత్యున్నతమైన "భారత కీర్తి కిరీటి పురస్కారం" ప్రధానం చేశారు. ఈ శుభ సందర్భంలో సత్తెనపల్లి పట్టణం లోని పలు వురు ప్రముఖులు కట్టా శివ దుర్గారావు, వంగర మధు, వంగర శ్రీనివాసరావు, అవ్వారు ఏడుకొండలు గంజి వీరాస్వామికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి సేవా నిరతిని కొనియాడారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేసి ఈ గౌరవాన్ని అందించిన తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు గంజి వీరాస్వామి తెలియజేశారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.రవి

వైద్య రంగంలో ఆశా వర్కర్ల పాత్ర కీలకం

డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైద్య రంగంలో ఆశా వర్కర్ల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యా లయంలో ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ పంపిణీ చేశారు. డాక్టర్ రవి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో లబ్ధిదారు లకు ఆరోగ్య సేవలను అందజేయడంలో ఆశావర్కర్ల కృషి మరువలేనిదని ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలందించేం దుకు ఆశాలు మూల స్తంభాలుగా నిలుస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న వైద్య ఆరోగ్య శాఖ కార్య కలాపాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. వయోజన టిబి టీకా కార్యక్రమంలో ఆశాలు లబ్ధిదారులను గుర్తించి టీకా వేసుకునేలా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని ఆశా కార్యకర్తలు తమ విధులను సక్రమంగా నిర్వ హిస్తూ జిల్లాను ఉన్నత స్థాయిలో నిలిపేందుకు తమ వంతు కషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ పద్మావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ బి గీతాంజలి, డిపిహెచ్ఎన్ఓ సురేఖ, డిసిఎం సురేష్, ఆశాలు పాల్గొన్నారు.

నువ్వుల సాగుతో అధిక ఆదాయం

వేసవిలో ఆరుతడి పంటగా సాగు



సాగులో ఉన్న నువ్వుల పంట

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వేసవి సాగుకు అనుకూలించడంతో పాటు నూనె గింజల పంటలలో నువ్వు పంట ప్రధానమైనదిగా ఉంది. ప్రధాన పంట కాలం పూర్తి కాగానే ఫిబ్రవరిలో విత్తుకొని అతి తక్కువ సమయంలో అధిక లాభాన్ని పొందవచ్చని రైతులు చెబుతున్నారు. వర్షాధారంగా సాగు చేసేకన్నా, వేసవిలో ఆరుతడి పంటగా వేయడంతో విత్తన నాణ్యతతో పాటు దిగుబడి కూడా పెరుగుతుందని చీడపీడల సమస్యా తగ్గడంతో పాటు పంట మార్పిడిగా నువ్వులను సాగు చేస్తే, అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది.

నువ్వుల సాగుతో తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి సాధించవచ్చు. 80-85 రోజుల్లో పంట చేతికందడంతో రైతులు నువ్వుల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పల్నాడు జిల్లాలో 2 వేల హెక్టార్లకు పైగా రైతులు నువ్వులు సాగు చేశారు. మురుగు నీరు నిల్వ ఉండని నల్లరేగడి, తేలికపాటి నేలలు నువ్వుల సాగుకు అనుకూలమని అయితే, నీరు నిలుస్తూ, ఆమ్ల, క్షార గుణాలుండే నేలల్లో ఈ పంట వేయకపోవడం ఉత్తమమని అనుకూలమైన నేలల్లో దుక్కిని బాగా చదును చేసి, పొడి దుక్కి ఉండేలా చేసుకోవడం వలన విత్తన మొలకశాతం పెరుగుతుందని తద్వారా దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో ప్రధానంగా ఎలమంచిలి (వైఎల్ఎం) 11, 17, 66, గౌరి రకం విత్తనాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 2 కిలోల విత్తనాలకు 7-10 కిలోల సన్నని పొడి ఇసుకను కలుపుకొని, పొలంలో సమంగా చల్లుకోవాలి. వరుసల మధ్య దూరం 30 సెం.మీ. ఉండేలా చూసుకోవాలి. నువ్వులు చల్లే ముందు దుక్కిలో ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువు లేదా, ఒక టన్ను వర్మి కంపోస్ట్ బాగా కలియ దున్నాలి. దుక్కిలో ఎకరానికి 12 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. భాస్వరాన్ని సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో వేసుకుంటే, గింజ నాణ్యతతో పాటు నూనె శాతం కూడా పెరుగుతుంది. 30 రోజులకు మొదటి కలుపు తర్వాత నీటి తడి పెట్టుకొని, ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలుపుకొని మొక్కల మొదళ్లలో వేయాలి.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ:

కిలో విత్తనానికి 9 గ్రాముల థైరమ్ లేదా మ్యాంకోజెబ్, లేదా 2 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూ ఎస్ కలుపుకొని శుద్ధి చేసుకోవాలి. మొదటగా తెగుళ్ల మందుతో, ఆ తర్వాత పురుగు మందుతో విత్తనశుద్ధి చేసుకోవడం మంచిది. విత్తనాలు వేసిన వెంటనే నీటి తడిని తప్పకుండా ఇవ్వాలి. లేకుంటే మొలక శాతంపై ప్రభావం పడుతుంది. పూత దశ, కాయ వద్ధితో పాటు గింజ కట్టే దశలోను నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. విత్తిన తర్వాత 35-40 రోజుల నుంచి 65-70 రోజుల వరకూ ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. కలుపు నివారణకు 48 గంట లోపు లీటర్ నీటిలో 5 మి.లీ అలాక్లోర్ 50 శాతం లేదా పెండిమిథాలిన్ 30 శాతం ఇసి పిచికారీ చేయాలి. 20 రోజుల తర్వాత అదనపు మొక్కలను తొలగించి, చేనును పలుచన చేయాలి. మొక్కలు ఒత్తుగా ఉన్నట్లయితే కొమ్మలు, ఆకులు మాత్రమే ఏర్పడి, పూత, కాయ ఎక్కువగా రాదు. విత్తనాలు వేసిన 30 రోజుల వరకూ చేనులో ఎలాంటి కలుపు లేకుండా చూసుకోవాలి. వేసవిలో చీడపీడల సమస్య తక్కువే అయినప్పటికీ కొన్ని రకాల చీడలు ఆశించే అవకాశం ఉంది. సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపడితే, అధిక దిగుబడులు పొందవచ్చు.

క్షగాత్రుణ్ణి ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని బస్టాం డ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలై, రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడికి ఆ సమయంలో ఆ మార్గంలో వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ గమనించి ప్రథమ చికిత్స చేసి తన వాహనంలో హాస్పిటల్ తరలించి ప్రాణాపాయం నుండి కాపాడారు. క్షతగాత్రునికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యు లను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా గాయాల పాలైతే ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు సహాయం చేయా లని చెప్పడం కాకుండా తాను చేతలలో నిరూపిం



గాయపడిన యువకున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

చారు. ప్రమాదంలో గాయాలైన క్షతగాత్రుని పట్ల మానవ త్వంతో వ్యవహరించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ స్పందిం చడం తన వాహనంలోనే ఆసుపత్రికి తరలించిన తీరును చూసిన స్థానికులు ఎమ్మెల్యేను అభినందించారు.

రేపటి నుండి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి - మాచర్ల

ఈనెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు మాచర్ల పురపాలక సంఘం పరిధిలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ డి. వేణుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోప్ వే కాలనీ, అక్బర్ కాలనీ సచివాలయముల నందు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున ప్రజలందరూ ఆధార్ సంబంధిత సేవలను వినియోగించుకొనవలసినదిగా తెలియపరిచారు.

సిపిఎం అభిమాని కనిగిరి నాగేశ్వరరావు మృతి



నివాళి అర్పిస్తున్న సిపిఎం శ్రేణులు (ఇన్‌సెట్‌లో నాగేశ్వరరావు)

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణానికి చెందిన సిపిఎం అభిమాని కనిగిరి నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణంలోని పణిదం చేనేత సొసైటీ ప్రాంతంలో నివాసం ఉంటున్న కనిగిరి నాగేశ్వరరావు కొద్ది నెలలుగా అనారోగ్యం తో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో శు క్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక సీపీఎం శ్రేణులు శనివారం ఉదయం నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ నాగే శ్వరరావు చిన్నతనం నుండి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనే వారని అన్నారు. యువజన సంఘం కమిటీ సభ్యులతో పాటు యువజన సంఘం కార్యకలాపా లలో చురుకుగా పాల్గొని సిపిఎం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారని అన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారని అన్నారు. నాగేశ్వరరావుకు ముగ్గురు కుమారులు కాగా ఒక కుమా రుడు గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నాగే శ్వరరావు అంత్యక్రియలు శనివారం ఉదయం తన స్వగృహం నుండి జరిగాయి. సిపిఎం నాయకులు కట్టా శివ దుర్గారావు, అనుముల వీర బ్రహ్మం, అవ్వారు ప్రసాద్ రావు, ధరణికోట పుల్లారావు, పంతంగి ప్రభాకర్, బిట్రా పానకాలు, అనంత వెంకట్ నారాయణ, కనికపూడి యేసురత్నం, షేక్ సాయిబా, షేక్ సైదులు నివాళులు అర్పించారు.



పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడుతున్న రవిబాబు

'ఉపాధి' పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్టు అందుబాటులో ఉంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అచ్చంపేట

ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు అన్నారు. శనివారం అచ్చంపేట మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు పరిశీ లించారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచాలని కోరారు. సంఘాల గ్రూపులను రిజిస్ట్రేషన్ చేసి మేస్త్రీలకు ప్రత్యేక అలవెన్సులు ఫోన్లో ఇచ్చి నట్లయితే ఏ గ్రూపుకి ఆ గ్రూపు ఫోటోలు తీసి అప్లోడ్ చేయ డం జరుగుతుందని తెలిపారు. ఒకే రకమైన అనేక పనుల ను కలిపి ఒకే వర్క్ ఐడి ఇవ్వటం వలన దూర ప్రాంతం నుంచి కూలీలందరూ ఒకే చోటకి రావాల్సి వస్తుం దని ప్రతి పనికి ప్రత్యేకంగా వర్క్ ఐడీలు ఇచ్చి మెట్లు ద్వారా పనులు చూపించి కొలతలు వేయించి ఫోటోలు చూపించి వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులను కోరారు. పని దినాలను 150 రోజులు చేసి వేతనాన్ని పెం చాలనీ, ఉపాధి హామీ మేట్లకు ప్రత్యేకంగా అలవెన్సులు ఇచ్చి, కూలీలకు మజ్జిగ, మంచినీళ్లు, పలుకు పారా సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ఆందో ళనలో ఉపాధి హామీ కూలీలు అందరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రావెళ్ల వెంకటేశ్వర్లు ఉపాధి హామీ మెట్లు కూలీలు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈ ఏడాది జనవరి నెలలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల వ్యాప్తంగా 4,5,6,7,8 తరగతుల విద్యార్థులకు నిర్వహిం చిన మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్ లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేసినట్లు స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ప్రముఖ పోలీగ్లాట్ బహు బాషా కోవిదుడు గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు వెంకట్ పూలబాలతో కలిసి ప్రతిభ చాటిన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ప్రధమ, ద్వితీయ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు తల్లిదం డ్రుల సమక్షంలో రూ 10 వేలు, రూ 5వేలు అందజేసి సన్మా నించామని నాతాని తెలిపారు. అంతర్జాతీయ ప్రమా ణాల తో నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ పరిధిలో స్థాపించిన తమ స్కూల్ విద్యార్థులకు ఆరుకు పైగా విదేశీ



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ నాతాని తదితరులు

భాషలు మాట్లాడేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. చిన్నా రుల ఇష్టానికి తగినట్లుగా పుస్తకాలు ఎంపిక చేసి చదివేలా తల్లి తదండ్రులు ప్రోత్సహించాలన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ బర్న బాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటిబోతున్న శాలివాహనుల బతుకులు


మిద్దె సెంటర్లో కుండల విక్రయిస్తున్న శాలివాహనులు

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రచండమైన భానుడి తీక్షణమైన ఉగ్రదాడికి జనం విలవిలలాడుతున్నారు. దాహార్తి తీర్చుకునేందుకు ఉన్నత వర్గాల ప్రజలు చల్లటి పానీయాల కోసం కూల్ డ్రింక్స్, కార్నర్, ఐస్ క్రీమ్ పార్లర్, చల్లటి పండ్ల రసాలు, ఫ్రిడ్జ్‌ల వైపు చూస్తారు. పేదవాడు దాహార్తిని తీర్చుకోవడానికి కాస్తంత చల్లటి నీటి కోసం మట్టి కుండ వద్దకు వెళ్లి దాహార్తిని తీర్చుకుంటాడు. అందుకే మట్టి కుండను పేదవాడి ఫ్రిడ్జ్ అన్నారు. అయితే నేడు పేదవాడి ఫ్రిడ్జ్ మట్టి కుండ కనుమరుగైపోతుంది. వాటిని తయారు చేసే శాలివాహన జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయి. భగభగ మండే వేసవి ఎండలకు దాహార్తిని తీర్చుకునేందుకు పేద మధ్య తరగతి ప్రజలు సరాసరి వెళ్ళేది చల్లటి మంచినీటిని అందించే మట్టి కుండ వద్దకే... శాలివాహన కుటుంబాలు గతంలో వేసవికి రెండు నెలల ముందు నుంచే కుండల తయారీ ప్రారంభమయ్యేది. సుమారు 6 నెలలు పాటు కుటుంబంలోని పిల్లలు, పెద్దలు వివిధ రకాలైన మట్టి కుండలు తయారు చేసి మార్కెట్లో


కుండ తయారు చేస్తున్న వ్యక్తి (ఫైల్)

విక్రయించేవారు. దీంతో కాస్తంత డబ్బులు సంపాదించుకునేవారు. ఏడాదిలో వర్షాకాలం, చలికాలంలో కూలీనాలి పనులు చేసుకుంటూ జీవితాలు గడిపేవారు. అయితే ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్లాస్టిక్ తో తయారు చేసిన వస్తువులు మార్కెట్లోకి విరివిగా రావడంతో మట్టి పాత్రలు వాడకం, కొనుగోలు తగ్గిపోయింది. దీంతో మట్టి పాత్రలకు గిరాకీ తగ్గిపోవడం, శాలివాహనుల వఅత్తి గణనీయంగా తగ్గిపోవడం ప్రారంభమైంది. వేసవిలోనే కనీసం మట్టి కుండలు తయారు చేసుకొని విక్రయించుకుంటూ కాలం గడుపుతున్నారు. అయితే వేసవికాలంలో కూడా ఫ్రిడ్జ్ లు, చల్లటి వాటర్ క్యాన్లు, రావడంతో వేసవిలో అంతంత మాత్రంగా ఉన్న వఅత్తి కూడా ఫ్రిడ్జ్, చల్లటి వాటర్ క్యాన్లు రావడంతో కుండలు కొనే నాధుడే కరువు అవడంతో శాలివాహన జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. దీంతో శాలివాహన యువత ఇతర వఅత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే వఅత్తి పై ఆధారపడి, రెండో పని చేయలేని శాలివాహనుల జీవితాలు ప్రశ్నార్ధకంగా మారాయి. కుండల తయారీ శ్రమతో కూడుకున్న పని కావడంతో 50 సంవత్సరాలకే ఒంట్లోని జవసత్వాలు సన్నగిల్లి పనిచేయలేక పోతున్నామని శాలివా హనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల మొత్తం కష్టపడి కుండలు తయారు చేస్తే, వాటిని కాల్చే సమయంలో వాతావరణ అనుకూ లించక వర్షం పడితే బట్టి కుప్పకూలి కుటుంబం అంతా నెలరోజు లపాటు చేసిన శ్రమ నిరుపయోగ మవుతుంది. మునిగే నక్కపై తాటికా యపడిన చందంగా అంతంత మాత్రం గా వృత్తిని చేసుకుంటున్న శాలివాహను లకు మట్టి కూడా దొరకకపోవడం గమనార్హం. ప్రభుత్వం కనుమరు గవుతున్న కుండల తయారీ వఅత్తిని ప్రోత్సహించడానికి శాలివాహ నులకు చెరువులలో మట్టి తెచ్చుకునే హక్కును కల్పించాలని, వర్షాలకు బట్టీలు దెబ్బతినకుండా షెడ్ లు నిర్మాణం జరపాలని, 50 సంవత్స రాలు నిండిన శాలివాహములకు చేనేతలకు మాదిరిగా పింఛన్లు ఇవ్వాలని శాలివాహన సోదరులు కోరుతున్నారు.


ఎడ్ల బలప్రదర్శనలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని

ఎడ్ల బలప్రదర్శనతో ఈ ప్రాంతం కళకళలాడుతోంది : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - చేబ్రోలు

పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఆయన తండ్రి గారైన ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ పేరున స్థానిక వడ్లమూడి క్వారీ వద్ద నిర్వహించిన ఎడ్ల బల ప్రదర్శన కార్యక్రమానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా శనివారం పాల్గొన్నారు. సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ దలఢమైన శరీరం , నడకలో రాజసం, పందెలో పౌరుషం నింపుకున్న ఒంగోలు జాతి ఎడ్లను ఇక్కడకు తీసుకువచ్చి అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నారు అన్నారు. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి జ్ఞాపకార్థం, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చేపట్టిన ఈ ఎడ్ల బల ప్రదర్శన చూస్తుంటే గ్రామీణ క్రీడలు పొన్నూరు నియోజవర్గానికి తరలివచ్చినట్టుందని కొనియాడారు. సంప్రదాయాలతో ఈ ప్రాంతం కళకళలాడుతుంది. ఇలాంటి పండుగ వాతావరణంలో జరుగుతున్న బలప్రదర్శన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కార్యక్రయ నిర్వాహకులు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - చేబ్రోలు



5 నుండి పొన్నూరులో ఆధార్ క్యాంపులు పొన్నూరు పట్టణంలోని పురపాలక సంఘ పరిధిలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని పురపాలక సంఘ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. ఈ క్యాంపులు ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు మళ్లీ తిరిగి 12 నుండి 15వ తేదీ వరకు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయ పరిధిలో జరుగుతాయని తెలిపారు.

కులగణన అంశంపై రాజకీయాలు తగవు..

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఈసారి జరిపే జనాభా లెక్కలతో పాటు దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపడతామంటూ" కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయాలు చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు రాజకీయ పార్టీలకు హితవు పలికారు. శనివారం మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,దేశ జనాభాలో సగం మందికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీలకు కులగణన చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. కుల గణనకై అనేక దశాబ్దాలుగా బీసీ సంఘాలతో పాటు-వివిధ కుల సంఘాలు-ప్రజా సంఘాలు-రాజకీయ పార్టీలు గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమిస్తూనే ఉన్నారన్నారు. ఎట్టకేలకు ఈనాటికి ఒక ఓబీసీ అయిన, దేశ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి,ఈసారి జరిపే జనగణనతో పాటే జాతీయస్థాయిలో సమగ్రంగా కులగణన కూడా చేయాలని, ఒక చారిత్రాత్మక విధాన నిర్ణయం తీసుకోవడాన్ని ఓబీసీ సమాజం హర్షిస్తుందన్నారు. అయితే జనాభా లెక్కలకు కేటాయించిన రూ 575 కోట్లు ఎట్టి



మాట్లాడుతున్న కేసన శంకరరావు

పరిస్థితులలోనూ సరిపోవని, ఇప్పుడు అదనంగా కులగణన చేయాల్సి ఉన్నందున, బడ్జెట్లో అదనపు కేటాయింపులు జరపాలన్నారు. గతంలో పదేళ్ల కిందట కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు 165 కోట్లను ఈ పనికి కేటాయించినప్పుడు,ఇప్పుడు జాతీయస్థాయిలో జనగణనతో పాటు జరిపే కులగణనకు కలిపి కనీసం రూ: 2,000 కోట్లన్నా కేంద్రం ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాం బాబాజీ, ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంబీసీ మూర్తి, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్,రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కల్లూరి హనుమంతరావు, ఆల శివాజీ, అడపా శ్రీనివాస్, ఉడత శ్రీనివాసరావు,చంద్రశేఖర్,యుగంధర్, దానాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీల మేనేజర్లకు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20వ తేదీ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని శనివారం తాడేపల్లి పట్టణంలోని వివిధ కంపెనీల మేనేజర్లకు, గోడౌన్‌లో మేస్త్రులకు సమ్మె నోటీస్ అందజేశారు. సెంట్రల్ వేర్ హౌసింగ్, సర్వో ఆయిల్ కంపెనీ, హిందుస్థాన్ పెట్రోలియం బంక్, చేపలు గ్రేడింగ్ కంపెనీ, ఎమ్మార్వో కార్యాలయం, క్యాపిటల్ బిజినెస్, బిర్లా మోర్ కంపెనీ, చైతన్య గోదావరి బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, టి టి యార్డ్ తదితర చోట్ల ఆయా బాధ్యులకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని విమర్శించారు. వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు కారు చౌకగా అప్పగించడానికి


సమ్మెనోటీసు అందజేస్తున్న నాయకులు

ప్రధానమంత్రి సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. పోరాడి సాధించుకున్న హక్కులను కూడా కాల రాస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బురగ వెంకటేశ్వర్, ఏఐటీయూసీ టి వెంకటయ్య, ఐఎన్‌టియుసి దర్శనపు సామెల్, వైయస్సార్‌టియుఆర్ శ్రీనివాసరాజు, ఏఐఎఫ్‌టియున్యూ కె.ఆదినారాయణ, ఐఎఫ్‌టియు ఎం.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



పిల్లలు క్రమశిక్షణతో ఎదగాలి


ప్రజాశక్తి - పెదనందిపాడు

పిల్లలు క్రమశిక్షణతో ఎదగాలని ఉత్తమ ఉపాధ్యాయురాలు మక్కెన జవహర్ రాణి ఉద్బోధించారు. గత 8 రోజులుగా పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పిల్లలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ముగింపు సభలో జవహర్ రాణి మాట్లాడారు. చిన్నతనంలో మంచి అలవాట్లు, క్రమశిక్షణ అలవరచుకుంటే జీవితంలో పట్టుదలతో ఎదగవచ్చని తెలిపారు. నేటి బాలలే రేపటి భావి భారతపౌరులని కృషి, పట్టుదల ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడ తాయని చెప్పారు. ఈ శిక్షణా శిబిరంలో పిల్లలకు బమ్మలు, పేపరుకటింగ్స్ నేర్పడం సంతోషదాయకంగా ఉందని అన్నారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రంలో పిల్లల వేసవి శిక్షణా శిబిరం నిర్వహించడాన్ని పిల్లల తల్లిదండ్రులు హర్షిస్తున్నారని తెలిపారు. సెల్ ఫోన్‌కు, ఎండలకు దూరంగా కొంత సమయమైనా గడిపేందుకు ఈ వేసవి శిక్షణ ఉపయోగపడ తాయన్నారు. ఆటలు, లెక్కలు, బొమ్మలతో పాటు అనేక విషయాలు చెప్పడం జరిగిందన్నారు. పిల్లలలో అల్లరి తనం ఎక్కువగా ఉందని, ఉపాధ్యాయులు నేర్పే విషయాలు శ్రద్ధగా విని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

భద్రావతి నగర వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

పాత మంగళగిరి భద్రావతి నగర వద్ద రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని శనివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఆలిం భాషను సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వందలాది వాహనాలు ఈ రోడ్డు మార్గం గుండా వెళుతున్నాయని, వేగంగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని విన్నవించారు. రోడ్లకు ఇరువైపులా షాపులు ఉండటం వల్ల కూడా అంతరాయంగా ఉందని తెలిపారు. ఈ మార్గంలోనే స్మశానం ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, అందువలన స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, సిపిఎం నాయకులు మునగాల రాంబాబు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న హరీష్

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - చేబ్రోలు

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణదాతగా నిలిచిన మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రక్త దాతలు. హైదరా బాద్ లింగంపల్లి సిటిజన్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పేషెంట్‌కు ఆపరేషన్ నిమిత్తం బ్లడ్ అత్యవసరం కాగా మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ సంప్రదించడం జరిగిందని అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమా శంకర్ తెలిపారు. తమ సంస్థకు చెందిన తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి 18వ సారి రక్తదానం చేశారన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ బండారు హరీష్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకొకసారి కచ్చితంగా రక్తదానం చేస్తామని అన్నారు. ఇలా రక్తదానం చేయడం వలన ఆరోగ్యం మెరుగా ఉంటుందన్నారు. సంస్థ అధ్యక్షుడు తిరుమల శెట్టి ఉమా శంకర్ మాట్లాడుతూ రక్తదానం చేసిన తమ సంస్థ వైస్ ప్రెసిడెంట్ హరీష్ కృతజ్ఞతలు తెలిపారు. యువతి యువకులందరూ రక్తదానం చేయాలని కోరారు.

రాజధానితో బాటు పల్నాడూ అభివృద్ధి చెందుతుంది

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ఏపీ కలల రాజధాని పునర్నిర్మాణం పనులు ప్రధాని చేతులు మీదుగా దిగ్విజయంగా ప్రారంభమైన వేళ అమరావతితో బాటు వెనకబడ్డ ఎగువ పల్నాడు కూడా అభివృద్ధి చెందుతుందని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపు రూ. 50 వేల కోట్లతో ప్రారంభమయ్యే రాజధాని పనులతో ఎగువ పల్నాడు కూడా సామాజీక, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో పురోగతి సాధించబోతుందని తెలిపారు. మౌళిక రంగాలు, కనీస అవసరాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం నేతృత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొగ్గుచూపుతున్నారని, తద్వారా పల్నాడు ప్రాంతం కూడా పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తోందని పేర్కొన్నారు. త్వరలో మాచర్ల నియోజకవర్గంలో రోడ్లు, తాగు, సాగు నీటి ప్రాజెక్టు నిర్మాణాలు పరుగులు పెడతాయని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లో రాజధాని పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని మోడి విచ్చేసి, ఏపీ అభివృద్ధికి అన్నీ విధాలుగా వెన్ను దండుగా నిలబడతానని హామీ ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే జూలకంటి హర్షం వ్యక్తం చేశారు.



సిద్ధంగా ఉంచిన పిఎండిఎస్ విత్తనాలు

పిఎమ్‌డిఎస్ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - పెదకూరపాడు

30 రకాల విత్తనాలతో కూడిన విత్తనాల కిట్టును సిద్ధం చేసినట్లు ప్రకతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. శనివారం పెదకూరపాడులో నూనె జాతి, కాయ జాతి, చెట్టు జాతి, తీగజాతి విత్తనాలను కలిపి కిట్టుగా తయారు చేసినట్లు తెలిపారు. వీటి వల్ల నేల గుల్లబారి అధిక వర్షమైన అధిక బెట్టైనా తట్టుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అమూల్య, ఉదయలక్ష్మి, మహబూబ్బీ, జ్యోత్స్న, వ్యవసాయ సిబ్బంది శశి, జ్యోతి పాల్గొన్నారు. కావలసినవారు 95151 82464, 8790682858 లో సంప్రదించాలన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి నరేంద్రరెడ్డి

తిమ్మాపురంలో కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - యడ్లపాడు

తిమ్మాపురం: అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వం కల్పించిన చట్టబద్ధమైన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల సందర్భంగా శనివారం తిమ్మాపురంలోని వసంత నూలు మిల్లులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని, ప్రతి కార్మికుడూ పనికి తగ్గ వేతనం పొందే హక్కు ఉందన్నారు. బాల కార్మికుల నియామ కం నిషిద్ధమని, దానికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను కూడా వివరిస్తూ, అవగాహన కల్పించారు. కార్మికులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి, మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొంద వచ్చని సూచించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్ ప్రసాద్, న్యాయవాదులు పి. వెంకటేశ్వరరావు, ఎ.శివరావు, ఏఎస్పై వెంగయ్య, హెచ్ఆర్ఎం పుల్లారావు, శ్రీహరి పాల్గొన్నారు.



జర్నలిస్టులను సన్మానిస్తున్న నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్



ప్రసాద్‌ను సన్మానిస్తున్న అతిథులు, క్లబ్ సభ్యులు

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా జర్నలిస్టులు

పత్రిక స్వేచ్ఛ దినోత్సవాన్ని సందర్భంగా పలువురికి సత్కారం

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఎడ్లపాడు మండలంలో శనివారం జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మా పురం గ్రామానికి చెందిన నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సువర్ణ కుమారి మాట్లాడుతూ "సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రభుత్వానికి ప్రజల మధ్య బలమైన వారధిగా పాత్రికేయులు వ్యవహరిస్తున్నారు. వారు సమాజ శ్రేయస్సు కోసం చేస్తున్న సేవలకు గౌరవంగా ఈ సత్కా రాన్ని నిర్వహించాం," అని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ, 1991లో విండ్ హెూక్ డిక్లరేషన్ నేపథ్యంలో 1993లో మే 3వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని, పత్రికా రంగం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ప్రపంచ తొలి జర్న లిస్టు, భారత తొలి జర్నలిస్టు, తొలి మహిళా జర్నలి స్టులను స్మరించుకున్నారు. దేశవ్యాప్తంగా 400 పైగా టీవీ ఛానళ్లు ఉన్నా, పత్రికలు మాత్రం వేలల్లో ఉన్నా యని, సోషల్ మీడియా ప్రభావం మరింత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రాంతీయ పత్రిక స్వేచ్ఛ సూచీలో నార్వే, ఐర్లాండ్, డెన్మార్క్ మొదటి మూడు స్థానాల్లో ఉండగా, నార్త్ కొరియా చివరిస్థానంలో ఉందని చెప్పారు. భారతదేశం 161వ స్థానానికి పడి పోవడం తీవ్ర విచారకరమని వారు అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులు ఐక్యతతోనే స్వేచ్ఛను సాధించుకోగలమని తెలిపారు. ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిం'సిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మానుకొండ రామారావు, వైవి రమేష్ బాబు, వైబి శ్రీనివాసరావు, షేక్‌హసన్ వలి, పావులూరి బ్రహ్మానందం, వంకాయలపాటి శ్రీధర్, పోపూరి వెంకట్రావు, పోపూరి నాగ చౌదరి, సుందర్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జర్నలిస్టులకు స్వేచ్ఛ అవసరమని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ ప్రధా నోపాధ్యాయులు ఉప్పలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ సందర్భంగా ప్రెస్ క్లబ్ చిలక లూరిపేట ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు, సీనియర్ నటుడు వంకాయలపాటి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉప్పలపాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రసాద్ గతంలో ఈనాడు దినపత్రికలో అత్యధిక కాలం పనిచేసి అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లటానికి దోహదపడ్డారని, ఇటీవల నటనలో రాష్ట్ర ప్రభుత్వ కందుకూరి పురస్కార అవార్డు కూడా అందుకున్నా రని, అటువంటి వ్యక్తికి సన్మానం చేయడం సముచిత నిర్ణయమన్నారు. మీడియా ఎల్లప్పుడూ ప్రజల పక్షమే ఉండాలని, అదే అత్యంత ప్రాధాన్యత అని వెల్లడించారు. మరోఅతిథి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజల పట్ల, సమాజంపట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఏపీయూడబ్ల్యూ జే జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అడపా అశోక్ మాట్లాడుతూ ఈనాడు ప్రసాద్‌గా సుపరిచితుడైన ప్రసాద్‌ను సన్మానించుకోవడం తమకు గర్వంగా ఉందని, ఆయన మార్గదర్శకత్వంలో సూచనలు అందుకొని క్లబ్ సభ్యులు పయణించాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథులు, క్లబ్ సభ్యులు కలిసి ఆర్‌వి ఎస్‌సివిఎస్ హైస్కూల్ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, కొండపాటి రమేష్, పెనుమల మనో హర్, మర్రిపూడి వాసు, నరసింహ శ్రీకాంత్, కొచ్చర్ల చందు, నాదెండ్ల సుందరబాబు, రావిపాటి రాజా పాల్గొన్నారు.



వృద్ధులకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వద్దుల ఆరోగ్య పరిరక్షణకు ఇన్నర్ వీల్ క్లబ్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రముఖ సేవా సంస్థ అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు క్లబ్ ఆధ్వర్యంలో డెంటల్ క్యాంపు నిర్వహించారు. విష్ణుడెంటల్ ఆసుపత్రికి చెందిన దంతవైద్యులు డాక్టర్ మురకొండ రాజశేఖర్ పరీక్షలు నిర్వహించి, సూచనలు సలహాలు అందజేశారు. కొంత మందికి వైద్య సేవల కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు. వృద్ధులకు, అక్కడి సిబ్బందికి గట్టు సరోజిని ఆర్థిక సహాయంతో పండ్లు, టూత్ పేస్టులు, బ్రష్‌లు ఉచితంగా అందజేశారు. క్లబ్ ప్రెసిడెంట్ గట్టు సరోజి మాట్లాడుతూ గతంలోనూ ఇన్నర్‌వీల్ క్లబ్ తరుపున వృద్ధుల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ వృద్ధుల సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్థి రంగారావు అసోసియేట్ డైరెక్టర్ జాష్టి విష్ణుప్రియ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ తియ్యగూర రమాదేవి పాల్గొన్నారు. సాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలో క్లబ్ సభ్యురాలు పంగులూరి ధనలక్ష్మి దంపతుల అర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు.



వెంకట త్రిలోక్‌ను అభినందిస్తున్న గెల్లి గాలిరెడ్డి

6వ తరగతి ప్రవేశ పరీక్షలో కేరళ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

6వ తరగతిలో సీట్ల భర్తీ కొరకు గత నెల 2న రొంపి చర్ల మండలం వి.రెడ్డిపాలెం ఏపి మోడల్ లో నిర్వహించిన పరీక్షలలో తమ విద్యార్థులు ముప్పూరి వెంకటత్రిలోక్ 100 మార్కులకు గాను 93 మార్కులు, నంబుల లహరి 91 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని మండల కేంద్రం రొం పిచర్ల కేరళ మోడల్ స్కూల్ డైరెక్టర్ గెల్లి గాలిరెడ్డి తెలిపారు. మొత్తం 250 మంది విద్యార్థు లు పరీక్షలు రాయగా తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. తమ స్కూల్ స్థాపిం చిన దగ్గర నుండి ప్రతి ఏడాది జవహర్ నవోదయకు, మోడల్ స్కూల్‌లో పదుల సంఖ్యలో ఎంపి కవు తున్నారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాధారణ ఫీజుల తో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన ఒత్తిడి లేకుండా సులభ రీతిలో అందిస్తున్నామన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను స్కూల్‌డైరెక్టర్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - మాచర్ల



కమిషనర్ డి. వేణు బాబు

మాచర్ల పురపాలక సంఘ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్‌సి లబ్దిదారులకు ఎస్‌సి కార్పోరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి. వేణు బాబు శనివారం తెలిపారు. గత ఐదేళ్లుగా ఎస్‌సి కార్పోరేషన్ ద్వారా ఎటువంటి లబ్ధిపొందని వారు, దారిద్ర్య రేఖకు దిగువున వున్న అభ్యర్థులు htpps: //apobmms.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా వారి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవలని తెలిపారు. మున్సి పాలిటి పరిధిలో 29 యూనిట్లుకు గాను రూ.64.81 లక్షలు మంజూరు చేస్తారని, దానిలో రూ. 44.20 లక్షలు సబ్సిడీ మంజూరు చేస్తారని తెలిపారు. ఈనెల 10వ తేదీ లోపు ధరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అబ్ధిదారులు 21 నుండి 50 సంవత్సరాల లోపు వారై, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. ఆటో కోసం దరఖాస్తు చేసుకొనే వారు డ్రైవింగ్ లైసెన్సు కలిగి వుండాలని చెప్పారు. పట్టణంలోని అర్హులైన వారు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాలు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని శివయ్య స్థూపం వద్ద ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి దారీ వేముల, మారియబాబు పతాక ఆవిష్కరణ చేశారు. మారియబాబు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని యువతకు మాట ఇచ్చి గాలికి వదిలేసారని మండిపడ్డారు. దేశంలో యువతకు ఇచ్చిన మాటను గాలికి వదిలేసింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం జనసేన నిరుద్యోగులకు యువతకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాలోమీ, పద్మ, మస్తాన్, మీరవాలి, సుభాని, మల్లికార్జున్, రవి, సాంబయ్య పాల్గొన్నారు.

నాడు పార్కుల పేరుతో పేదల ఉసురు తీశారు..

నేడు మందుబాబులకు అడ్డాగా మార్చారు..





ఆలనా పాలన లేకు మద్యం సీసాలు, చెత్తాచెదారంతో నిండిపోయిన పార్కులు

ప్రజాశక్తి - తాడేపల్లి

అది 2016వ సంవత్సరం. ఒకవైపు అందరూ సంతోషంగా కఅష్ణ పుష్కరాలు జరుపుకోబోతున్న సమయం. మరోవైపు పేదలకు ఆ సమయం దుర్దినంగా మారింది. ఉండవల్లి సెంటర్ నుండి బకింగ్ హామ్ కాలువ వెంబడి రైలు బ్రిడ్జి అక్కడనుండి తాడేపల్లి కొత్తూరు ఆంజనేయస్వామి గుడి వరకు కాలువ కట్ట పక్కన ఉన్న పేదల ఇళ్లను ప్రభుత్వ అధికారులు తొలగించారు. పేదల ఇల్లు తొలగించిన ప్రాంతంలో పార్కులు ఏర్పాటు చేస్తామని, తాడేపల్లి పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచుతామని ఆనాడు ఉన్న పాలకులు తీయటి మాటలు చెప్పారు. డిపిఆర్ కోసం లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. లక్షలాది రూపాయలు పేదల ఇళ్ల కూల్చిన చోట పెద్ద పెద్ద నాయకుల పేరుతో పార్కులు ఏర్పాటు చేశారు. అందులోకి మరలా పేదలు వెళ్తారేమోనని ఇనుప రైలింగ్ పెట్టారు. పార్కుల పేరుతో బోర్డులైతే దర్శనమిచ్చాయి గాని వాటి ఆలనా పాలన నేటి వరకు గాలికి వదిలేశారు.

లక్షలాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం

పార్కుల స్థలాలకు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప రైలింగ్ కొన్నిచోట్ల దొంగల పాలయ్యింది. సీతానగరంతో కలుపుకొని మొత్తం 500 పేదల ఇళ్లను తొలగించి అధికారులు తమ ఉసురు పోసుకున్నారు. తొలగించిన లబ్ధిదారులకు స్థలాలు ఇస్తామని చెప్పి 240 మందిని అర్హులుగా గుర్తించారు. మరో 260 మంది పేర్లు లిస్టులో లేకుండానే ఎగర కొట్టేశారు. అధికారులు గుర్తించిన వాటిలో కూడా నేటికీ అందరికీ న్యాయం జరగలేదు. సీతానగరం దగ్గర తాత్కాలిక స్థలాలు పేరుతో ఒక్కొక్కరికి 30 గజాలు చొప్పున 80 మందికి స్థలం కేటాయించారు. అక్కడ నివాసం ఉంటు న్న వారి బాధలు మౌలిక సౌకర్యాలు లేక వర్ణతితంగా నేటికీ ఉన్నాయి. 30 గజాల స్థలం పెద్దోళ్ళు బాత్రూం కూడా సరిపోదని విమర్శలు అప్పట్లో వెల్లువొత్తాయి. మరో 127 మందికి ఉండవల్లి అంబేద్కర్ నగర్ కెళ్ళే దారిలో గుంటూరు ఛానల్ హెడ్ రెగ్యులేటర్ దగ్గర, తాడేపల్లి పట్టణ పరిధిలోకి వచ్చే పాలకం పాడు లో 45 గజాల చొప్పున కేటాయించారు. బాధితులందరికీ ఇల్లు కట్టి పెడతామని పాలకులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. పేదల కడగండ్లు నేటికీ అలాగే ఉన్నాయి. ఉండవల్లి సెంటర్లో పేదల ఇల్లు తొలగించి పార్కులు ఏర్పాటు చేసిన స్థలం నేడు మందుబాబులకు అడ్డాగా మారింది. ముందు ఒక వైన్ షాప్ ఏర్పాటుచేసిన నిర్వాహకులు అది శాలదన్నట్టు మరో వైన్ షాప్ కూడా ఏర్పాటు చేశారు. మద్యం కొనుగోలు చేసిన మందుబాబులు పార్కుల్లో కూర్చొని తాగి అక్కడే తందనాలు ఆడుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున పోగుబడి పర్యావరణానికి ఆటంకంగా తయారైంది. పాలకులు మారిన పేదలు బాధలు తీరటం లేదు. సొంత ఇంటి కల స్వప్నం సాకారం కావడం లేదు. పేదల బాధలు తీరాలి అన్న, సొంతింటి ఇల్లు పేదలందరికీ దక్కాలన్న సోషలిస్ట్ వ్యవస్థలోనే సాధ్యమని సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్ లు ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులు నిరంతరం పర్యవేక్షించాలి

ప్రజాశక్తి - గుంటూరు



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని గుంటూరు రూరల్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి అన్నారు. మండల పరిషత్ జనరల్‌బాడీ సమావేశం ఎంపిపి అధ్యక్షతన శనివారం గుంటూరు రూరల్ మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో కొన్ని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కావున నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులు చేపట్టాలన్నారు. ఎంపిడిఓ బండి శ్రీనివాసరావు మాట్లాడారు. సమావేశంలో విస్తరణాధికారి శ్రీనివాస్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

8న పట్టాభి సీతారామయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు

ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య విగ్రహావిష్కరణ ఈనెల 8వ తేదీ, ఉదయం 9 గంటలకు స్థానిక హిందూ కళాశాల యూనియన్ బ్యాంక్ కార్యాలయంలో నిర్వహి స్తున్నట్లు ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆహ్వాన కమిటీ చైర్మన్ కె.హరిబాబు ఒక ప్రకట నలో తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఉదయం 10గంటలకు బహిరంగ సభ జరుగుతుందన్నారు.



పొన్నూరు మండలం ఎంఈఓ -2గా విజయభాస్కర్

ప్రజాశక్తి - చేబ్రోలు

పొన్నూరు మండలం ఎంఈఓ-2 బాధ్యతలను విజయభాస్కర్ శనివారం స్వీకరించారు. సందర్భంగా మండల యూటీఎఫ్ యూనియన్ అధ్యక్షులు భాస్కర్ రావు కార్యదర్శి హరి ప్రసన్న లక్ష్మణ్ ,ఇర్షద్ , మురళి కఅష్ణ లు ఆయనను కలసి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ -1 చలపతిరావు, కెన్నెడీ, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకు సాగండి

గ్రామీణ మహిళలకు కేంద్రమంత్రి చంద్రశేఖర్ పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గ్రామీణ మహిళలు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ విద్య, వ్యాపార రంగాల్లో పురోగతి సాధించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి సమాచార శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. కష్టాలతో కుంగిపోకుండా మనోధైర్యంతో స్వయం ఆర్థిక స్వావలంబన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో ఆరు ముండలాలకు చెందిన గ్రామీణ మహిళలకు మంత్రి వివిధ రకాల ఉత్పత్తుల తయారీకి ఉపయోగించే యంత్రాలను పంపిణీ చేశారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద పరిగణించే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి తన వంతు సహకారం అందించడం ప్రశంసనీయమన్నారు. పేదరికంతో నలిగిపోయే మహిళలు నూతన వ్యాపారాలను ప్రారంభించాలనీ, ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. యూనివర్సిటీ ఎంటర్ప్రెన్యూర్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ సిద్ధార్థ త్రిపాసి అదితీ ప్రోగ్రా. వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరి తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు మండలాలకు చెందిన 100 అంకుర సంస్థలు రూ.72 లక్షల విలువైన యంత్ర పరికదాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మనోజ్ ఆరోరా, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్లు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సభా కార్యక్రమానికి ముందు మంత్రి పెమ్మసాని మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు. స్వయంగా రుచి చూసి ఉత్పత్తుల మార్కెటింగ్ పెంచేందుకు సహకారం అందిస్తామన్నారు.



వివిధ రకాల ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని


పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరి : ఎడిఎ ఉషారాణి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెదరావూరు గ్రామంలో భూసార పరీక్షా విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ ఉషారాణి అధ్యక్షతన భూసార పరీక్షలు నిర్వహించే విధానాన్ని రైతులకు సిబ్బందికి వివరించారు. భూమి లోపల ఐదు, ఆరు అంగుళాలు లేదా 15 సెంటీమీటర్లు లోపు పొరల్లో ఉన్న మట్టిని ఎకరానికి 5 లేక 6 చోట్ల సేకరించాలన్నారు. ఇలా పొలాల్లో సేకరించిన మట్టిని గొనె పట్టాపై 4 ఎదురెదురు భాగాలుగా విభజించాలన్నారు. ఇలా ఎదురెదురు భాగాలను రెండుదపాలుగా సేకరించి వచ్చిన అరకేజి మొత్తాన్ని మెత్తగా, సన్నని పొడిగా చేసి పాలిథిన్ కవర్లో భద్రపరచాలన్నారు. రైతు వివరాలతో పాటు పొలం సర్వే నంబరును కవర్లపై నమోదుచేసి భూసార పరీక్షల ల్యాబ్ కు తరలించాలన్నారు. వ్యవసాయ అధికారి ప్రేమ సాగర్ మాట్లాడుతూ పొలాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంత మోతాదులో ఉన్నాయో భూసార నమూనా పరీక్షలు ద్వారా తెలుస్తుందని చెప్పారు. ముందుగానే దుక్కి చేసుకోవడంవలన వర్షాలు కురిసే సమయానికి ఖరీఫ్ పంటలను సరైన అదునులో నాటుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల సిబ్బంది హెూగ్లా, ఏంజెల్, మౌనిక, వాణి, మణి దీపిక, సాయి దీపిక, చరణ్, అహ్మద్, శివతేజ, సంసోనమ్మ, లక్ష్మీ, ఎఈఒ లు మోహన్, గోపి, రైతులు పాల్గొన్నారు.



భూసార నమూనా పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఎడిఎ ఉషారాణి



ఉపకార వేతనాలు అందజేస్తున్న అద్దంకి శ్రీధర్‌బాబు, మేయర్

విద్యార్థుల్ని ప్రోత్సహించటం అభినందనీయం

ప్రజాశక్తి - గుంటూరు

సత్యసెక్యూరిటీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల్లో ఇంటర్, పదో తరగతిలో ప్రతిభ చూపించిన 20 మంది విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టుబాకో బోర్డు మాజీ ఈడి అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సులోనే తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల్ని గౌరవించాలని, స్నేహభావం పెంపొందించుకోవాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ భార్గవి, రైల్వే శాఖ ఉన్నతాధికారి మోహన్‌కృష్ణ ప్రసంగించారు. సంస్థ ఎమ్‌డి కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తమ సంస్థ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏరిస్ కంపెనీ జిల్లా అధినేత రత్తయ్య, విశ్రాంత అధ్యాపకులు జి.వి.రాయుడు, సత్య సెక్యూరిటీస్ మేనేజర్ సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయన్ని సందర్శించిన తెనాలి చంద్రకుమార్ దంపతులు

ప్రజాశక్తి - పెదకాకాని



మండల కేంద్రమైన పెదకాకానిలోని మల్లేశ్వర స్వామి వారిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ అదనపు కమీషనరు తెనాలి చంద్రకుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ ఆలయ అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్చారణల నడుమ మేళతాళములత సాదర స్వాగతం పలికారు. స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఉపకమీషనర్ గోగినేని లీలాకుమార్ అందజేశారు.

151వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి



తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శనివారం నాటికి 151 ఒక రోజుకు చేరుకున్నాయి. దీక్షలో వై.సాంబశివరావు, కె.హగ్గయ్య, సిహెచ్. పిచ్చయ్య, జి.కొండ, ఎం.గురవయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, టి.నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, వై .యెహెూషువ, ఎస్.కె.ఇమాంబి, ఈ.శారమ్మ, డి.సువర్ణ కుమారి, ఎ.విజయశ్రీ, టి.దుర్గా భవాని, యు.రమణ, డి.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

మే డే కవితల పోటీల్లో ఆళ్లకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - తెనాలి



ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ముషీరాబాద్‌కి చెందిన తెలుగు రాజ్యం సాంస్కృతిక సేవా సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన వచన కవితల పోటిల్లో పట్టణానికి చెందిన కవి డాక్టర్ ఆళ్ళ నాగేశ్వరరావు ప్రథమ బహుమతిని పొందారు. 'నాయకుడంటే ఎలా ఉండాలి' అంశంపై 'ఆదర్శప్రాయుడై ఉండాలి' అనే శీర్షికన ఆళ్ళ రాసి పంపిన వచన కవితకు ప్రథమ బహుమతి లభించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోపరాజు రవి వెల్లడించారని ఆళ్ల తెలిపారు. నాగేశ్వరరావును పలువురు సాహితీప్రియులు అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు

12 నుండి ఐఎఎస్ ఫౌండేషన్ తరగతులు

ప్రజాశక్తి - గుంటూరు

కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) సంయుక్త ఆధ్వర్యంలో మే 12 నుండి 21వ తేదీ వరకూ పది రోజులు పాటు ఐఎఎస్ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. శనివారం సన్ సభ్యులతో కలిసి స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 8, 9, 10 తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఈ క్లాసులు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉంటాయన్నారు. ఐఎస్, ఐపిఎస్ వంటి సివిల్ సర్వీసెస్ పరీక్షల పట్ల పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించి, చిన్న వయస్సు నుండే సివిల్స్‌పై లక్ష్యాన్ని ఏర్పరచాలనే లక్ష్యంతో గత పది సంవత్సరాలుగా ఈ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిపుణులైన అధ్యాపకులతో తరగతుల బోధన ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 6309481514, 7995902645 9494808589లలో సంప్రదించాలని కోరారు.s ార్యక్రమంలో సన్ గుంటూరు కోఆర్డినేటర్ ఆశిష్, సభ్యులు మనీష్, వివేక్, ప్రతిమ, హరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న బాలకలు

వివిఐటియూలో 'ఎన్‌సిసి బాలికల' వార్షిక శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - పెదకాకాని

10ఏ గర్ల్స్ బెటాలియన్ ఎన్సిసి, గుంటూరు గ్రూప్ 8వ వార్షిక శిక్షణ శిబిరం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో ప్రారంభమైంది. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్, ఏవో మేజర్ అవినాసీ పట్వల్ పర్యవేక్షణలో 10 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 10ఏ బెటాలియన్ గుంటూరు గ్రూప్‌లోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 426 బాలికలు ఈ వార్షిక శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. విద్యార్థులకు సైనిక సూత్రాలు, క్రమశిక్షణ, నాయకత్వం మరియు మైత్రి పెంపొందించే నైపుణ్యాల పెరుగుదల లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఎన్.సి.సిలో శిక్షణ పొందే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనీ, శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశము క్యాడెట్ల ఉన్నతికి తోడ్పడుతుందని కర్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్ తెలిపారు. కార్యక్రమంలో వివిఐటియూ ఎన్‌సిసి అఫీసర్ డాక్టర్ ఎ.శ్రీవాణి, గుంటూరు ఎన్.సి.సి బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని సభపై అమరావతి రైతుల అసంతృప్తి!

రాజధాని అమరావతికి రూ.49 వేల కోట్ల అంచనాలతో చేపట్టనున్న పనులకు రెండో సారి ప్రధాని మోడీ చేసిన శంకుస్థాపన సభ వెలగపూడిలో అత్యంత అర్భాటంగా జరిగింది. అమరావతి పునర్ నిర్మాణ పనులకు ప్రధాని మోడీ కేవలం స్విచాన్ చేసి శంకుస్థాపన ప్రక్రియను ముగించారు. ఈపనులన్నీ 2014-19 మధ్య ప్రారంభించగా వివిధ దశల్లో ఆగిపోయాయి. వీటిని తిరిగి పూర్తి చేసేందుకు మరోసారి వందల కోట్లు ఖర్చు చేసి అర్భాటంగా సభ నిర్వహించి శంకుస్థాపన శిలాఫలకాలను ప్రధాని చేత ఆవిష్కరింప చేశారు. అయితే ప్రధాని నుంచి రాజధానికి ప్రత్యేకంగా ఎటువంటి నిధులు పొందలేకపోయారు. రైతుల తాజా డిమాండ్ చట్టబద్ధతపై ప్రధాని నుంచి ఎటువంటి హామీ పొందలేకపోయారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎవ్వరూ ప్రస్తావించలేదు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రాజధాని రైతులను ఇబ్బంది పెట్టిందని చెబుతున్న కూటమి నాయకులు ఈసారి అయినా అమరావతి నిర్మాణానికి చట్టబద్ధత కల్పించడానికి ప్రాథమికంగా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొత్త రాజధానికి కనీస వసతులు కేంద్రం నుంచి ఇంత వరకు కల్పించలేదు. రాష్ట్ర ప్రభుత్వం అడగటం లేదు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి మూడు రాజధానుల పేరుతో విశాఖపట్నంను పరిపాలన రాజధానిగా ప్రకటించడంతో ఈ ప్రాంత వాసులంతా తల్లడిల్లిపోయారు. ప్రధానంగా

7 వీక్షణం

రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల భవిష్యత్తు అంథకారంలో చిక్కుకుంది. గత ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానులకు వ్యతిరేకంగా 1631 రోజులు ఉద్యమం చేశారు. ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించాలన్న డిమాండ్‌ను వైసిపి ప్రభుత్వం పెడచెవినపెట్టింది. 2019-24 మధ్య అమరావతిని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నా కేంద్రం నోరుపెదపలేదని మోడీపై ఇప్పటికే రైతుల్లో తీవ్ర అసంతృప్తినెలకొంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధానికి తిరిగి పూర్వవైభవం వచ్చింది. అయితే మూడేళ్ల రాజధాని నిర్మాణం పూర్తిచేయడంతోపాటు తమకు అందాల్సిన సౌలభ్యాలపై రైతుల్లో ఆందోళన నెలకొంది. 2029లో మళ్లీ వైసిపి ప్రభుత్వం వస్తే తమపరిస్థితి ఏమటన్న ప్రశ్న రైతుల మనస్సులను ఆందోనకు గురి చేస్తోంది. నాలుగు రోజుల క్రితం రాజధాని రైతులతో సమావేశం అయిన సిఎం చంద్రబాబు నాయుడి వద్ద వారు తమ అనుమానాలను వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తామని చంద్రబాబు రాజధాని రైతులకు హామీ ఇచ్చారు. కానీ ఈ అంశాన్ని సిఎం చంద్రబాబు ప్రధాని వద్ద ప్రస్తావించకపోవడంతో రైతుల్లో అసంతృప్తి ఏర్పడింది. అమరావతి రైతులకు భరోసా కల్పించేలా చట్టం తెస్తామని హామీ ఇప్పించి ఉంటే తమకు కొండంత ధైర్యం ఉండేదని రైతులు చెబుతున్నారు. రాజధాని అమరావతికి సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు మౌలికంగా కొన్ని ప్రాథమిక అంశాలను పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. రాజధాని కేంద్రంగా అమరావతికి పోస్టల్ శాఖలో పిన్ కోడ్ లేదు. టెలికం శాఖకు సంబంధించి ఎస్‌టిడి, ఐఎస్‌డి కోడ్ లేదు. రాజధానిని ఒక మెగా కార్పొరేషన్ చేసి ఎన్నికలు నిర్వహించాలని రాజధాని రైతులు కోరుతున్నారు. ఇంత వరకు ఏనిర్ణయం జరగలేదు. రాజధాని ప్రాంతంలో అంతర్గతంగా నివాసాల మధ్య మౌలిక సదుపాయాల కోసం గ్రేటర్ అమరావతిగా ప్రకటిస్తే కేంద్రం నుంచి నేరుగా నిధులు వస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రం అప్పు ఇప్పించిందన్న కృతజ్ఞతతో మోడీని పొగడ్తం తప్ప ప్రత్యేకంగా నిధులు, గ్రాంట్లు ఏమీ అమరావతికి తెప్పించుకోలేకపోతున్నారని రాజధాని రైతుల్లో అసంతృప్తి నెలకొంది. అంతేగాక రూ.49 వేల కోట్లతో రూ.35 వేల కోట్లు ఇప్పటి వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణంగా పొంది ప్రభుత్వం చేపట్టనున్న నిర్మాణాలకు సంబంధించి అంచనాలను కూడా భారీగా పెంచారన్న విమర్శలు కూడా వచ్చాయి.

- ఎ.వి.డి.శర్మ

ప్రణాళికాబద్ధమైన కృషితో డిఎస్సీలో విజయం

ప్రజాశక్తి - గుంటూరు

డిఎస్సీ పరీక్షకు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.కఅష్ణకాంత్ అధ్యక్షతన డి.ఎస్సీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించి, కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సమయం తక్కువ ఉన్నందున పరీక్షకు ఎలా సిద్ధం కావాలి, ఏఏ అంశాలపై కేంద్రీకరించాలి, డిఎస్‌సి సిలబస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దాదాపు ఏడేళ్ల తర్వాత నోటిఫికేషన్ విడుదల అయినందున అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న 4 అంశాలను ప్రభుత్వం



మాట్లాడుతున్న కె.ఎస్.లక్ష్మణరావు

సానుకూల ధృక్పదంతో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా వయోపరిమితి 47ఏళ్లకు పెంపు, డిగ్రీలో అర్హత మార్కులు 50శాతం నుండి 40శాతంకి తగ్గించాలని, సిలబస్ రిత్యా 45 రోజులు కాలపరిమితి 90 రోజులుకి పెంచాలని, ఒక జిల్లాకు ఒకే పేపర్ ఇవ్వాలని కోరారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఇన్నాళ్లూ పోరాటం చేశామని, ఇప్పుడు నోటిఫికేషన్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. అసంబద్ధంగా ఉన్న నిబంధనలపై అభ్యర్థులు తీవ్ర ఆందోళణ వ్యక్తం చేస్తున్నారన్నారు. దీంతో పరీక్షకు చదువుకోకుండా ఆందోళనలు చేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. సదస్సులో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ కె.అనురాధ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవుల్ని ఎస్సీలుగానే గుర్తించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - గుంటూరు

దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నగర కార్యదర్శి జి.లూదర్‌పాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతం మారిన ఎస్సీల జీవితాల్లో, వారి సామాజిక హెూదాలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. సాధారణ ప్రజల దఅష్టిలో క్రైస్తవమతం పుచ్చుకున్న ఎస్సీలు మాల, మాదిగలుగానే మిగిలిపోయారన్నారు. వారు క్రైస్తవులుగా మారినప్పటికీ సవర్ణ హిందువులతో కలిసి కూర్చోవడానికి, బావులలో నీళ్లు తాగటానికి, ఊరు మధ్యలో నివాసం ఉండటానికి ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్లో ప్రవేశించడానికి ఇంకా భయపడుతూనే ఉన్నారన్నారు. మతంలోకి కులం చేరిన తర్వాత కమ్మ క్రైస్తవులు, కాపు క్రైస్తవులు, రెడ్డి క్రైస్తవులు, దళిత క్రైస్తవులు అంటూ క్రైస్తవంలో దళిత క్రైస్తవులు తక్కువగానే చూడబడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రైస్తవ మతంలోకి చేరిన దళితులకు ఎస్సీ హెూదా నిరాకరించి, రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇవ్వడం చాలా బాధాకరం అన్నారు. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకలణతో ఎస్సీ రిజర్వేషన్‌కు ప్రభుత్వాలు గండి కొడుతుంటే మరోవైపు క్రైస్తవ మతంలో చేరిన వారికి ఎస్సీ హెూదా నిరాకరించడమనేది రాజ్యాంగం కల్పించిన టువంటి రక్షణ చట్టాలను దూరం చేయటమే అవుతుందని అన్నారు.



మాట్లాడుతున్న సాయిగణేష్‌కుమార్

ఇంటర్వ్యూ నైపుణ్యాలపై హిందూ ఫార్మసీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో శనివారం 'రెజ్యూమ్ రైటింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కె.సి.మహేంద్ర లిమిటెడ్ ఫ్రీలాన్సు సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ నిడమర్తి సాయిగణేష్‌కుమార్ మాట్లాడుతూ రెస్యూమ్‌ని తయారు చేసే విధానం, క్రిటికల్ థింకింగ్, ఇంటర్వ్యూలో విజయం సాధించటానికి అనుసరించాల్సిన ప్రణాళిక గురించి వివరించారు. జీవితంలో ఉన్నత శిఖరాలు సాధించాలి అంటే విద్యార్థులు ప్రముఖంగా సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లభాషపై పట్టు, సానుకూల దఅక్పదం, సమయపాలన, లక్ష్యసాధన, ఆత్మవిశ్వాసం తదితర అంశాలపై అవగాహన ఏర్పడినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్‌ప్రిన్సిపల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : కేంద్ర మంత్రి చంద్రశేఖర్

- జిజిహెచ్‌లో స్టెప్ డౌన్ ఐసియు ప్రారంభం
- భారీగా వెంటిలేటర్లు వితరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని కోరారు. ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు గుంటూరు కి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ1.60 కోట్ల విలువైన వెంటిలేటర్లను, జిఎంసి లో చదువుకున్న 80వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 9 లక్షల చెక్‌ను మంత్రి ద్వారా పలువరు ప్రతినిధులు సూపరింటెండెంట్‌కు అందించారు. రూ. 22 లక్షలతో ఆధునీకరించిన స్టెప్ డౌన్ ఐసీయూను మంత్రి ప్రారంభించారు. భాష్యం పేరమ్మ ట్రస్టు ద్వారా ఎయిర్ కండీషనర్‌లు భారత్ ఫార్మా సంస్థ ఆధ్వర్యంలో ఐసియు మంచాలు కూడా జిజిహెచ్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆస్పత్రిలో మెరుగైన వసతులు వస్తున్నాయన్నారు. రూ. 2 కోట్ల విలువైన 4 నియో నేటల్ వెంటిలేటర్లు, 6 మొబైల్ వెంటిలేటర్లు, బెడ్స్, ఏసీలు, ఏర్పాట్లు అందజేసిన దాతలకు పెమ్మసాని దన్యవాదాలు


స్టెప్ డౌన్ ఐసీయూని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

తెలిపారు. రెడ్ క్రాస్ అనేది వందల సంవత్సరాల నుంచి సేవా అందిస్తున్న సంస్థ అని నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఈ సంస్థ ఆస్పత్రి అభివృద్ధికి ముందుకు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే నశీర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అవసరాలను గుర్తించి ముందుకు వచ్చిన దాతలను ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు, భాష్యం, నాట్కో, రెడ్ క్రాస్ సంస్థలు అందిస్తున్న సేవలు ఎంతో ముదావాహం అన్నారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఎంతో మంది ఉదారంగా వసతుల కల్పనకు తమ వంతు వస్తువులు, నగదు అందిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే మొహమ్మద్ నశీర్ అహ్మద్, మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని), దాతలు భాష్యం రామకఅష్ణ, . రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రరాజు సూపరింటెండెంట్ ఎస్-ఎస్‌వి రమణ, జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, జడ్పీ చైర్పర్సన్ క్రిస్టినా, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు.